క్లుప్తంగా

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



శీనయ్య నుంచి బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని దామరమడుగు గ్రామానికి చెందిన కరకంబాకం శీనయ్య గొంతు కేన్సర్‌లో బాధపడుతూ నెల్లూరులోని కేన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ ఎస్.భువనశ్రీ నెల్లూరులోని ఆస్పత్రికి వెళ్లి శీనయ్యకు రూ.2,750ల నగదును అందజేశారు. దీంతో వలంటీర్ భువనశ్రీకి శీనయ్య ధన్యవాదాలు తెలిపారు.

కళారంగానికి నిలయం సింహపురి

నెల్లూరు(బృందావనం): కళారంగానికి సింహపురి నిలయమని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మైండ్ గేమ్ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు సంబంధించిన పోస్టర్లను గాంధీబొమ్మ సమీపంలోని అమరావతి చాంబర్స్‌లో ఆదివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. వీఆర్సీ మైదానంలో ఈ నెల పదిన నిర్వహించనున్న కార్యక్రమానికి ప్రముఖ హీరోయిన్ కామ్నా జెత్మలానీ, సీరియల్ నటులు స్వాతి చౌదరి, స్వప్న, తదితరులు హాజరుకానున్నారని తెలిపారు. ప్రతిభ గల కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. నిర్మాత, దర్శకులు శ్రీలక్ష్మి, కిషోర్ శ్రీకృష్ణ, హీరో శ్రీరామ్, మురళి, వాసు, 25 కళాసంఘాల కన్వీనర్లు అమీర్‌జాన్, హరనాథ్‌రెడ్డి, దోర్నాల హరిబాబు, ఈవెంట్ ఆర్గనైజర్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఓసీసీఐ కమిటీ సభ్యుల నియామకం

నెల్లూరు(మినీబైపాస్): ఓడ్ కమ్యూనిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఓసీసీఐ) జిల్లా కమిటీ సభ్యులను ఎన్నుకున్నామని రాష్ట్ర అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. జిల్లా ప్రెసిడెంట్‌గా చంద్రగిరి రమణయ్య, ప్రధాన కార్యదర్శిగా నిరంజన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్‌గా సూరా కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గణేష్‌ను నియమించామన్నారు. గుంజి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నూతన ధ్వజస్తంభానికి పూజలు

నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నూతన ధ్వజ స్తంభానికి సంప్రోక్షణ, విశేష పూజలను ఆదివారం నిర్వహించారు. ఆదివాస హోమం, కుంభారాధన, హోమాలను జరిపారు. ఆగమ విద్వాన్ సత్యనారాయణాచార్యులు, ఆలయ ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు పర్యవేక్షణలో వేదపండితులు పూజలు చేశారు. పూజలకు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి హాజరయ్యారు. ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. ధ్వజ స్తంభ దాత కాకాణి నరహరిరెడ్డి, ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేదగిరిపై గుడి – బడి

నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గుడి – బడి కార్యక్రమాన్ని ప్రణవ పీఠ శిష్య బృంద ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణంలోని ప్రాంతాలను వారు శుభ్రం చేశారు. విష్ణు సహస్రపారాయణం, భక్తి గీతాలను ఆలపించారు. ప్రణవ పీఠ నిర్వాహకులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం

నెల్లూరు(బృందావనం): నవాబుపేటలోని ద్రౌపదీదేవి సమేత కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో చండీ హోమాన్ని దేవస్థాన పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు మద్దూరు సుబ్బారావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. నవావరణ మంత్ర పఠనం, దుర్గా సప్తశతి పారాయణం, తదితరాలను జరిపారు. దేవస్థానంలో కొలువైన స్వామివారికి అభిషేకాలు, పూజలను వేదపండితుడు వేదగిరి ఫణిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం సుమారు రెండు వేల మందికి ప్రసాదాలను అందజేశారు.

అందరూ సుఖసంతోషాలతో జీవించాలి

కృష్ణ ధర్మరాజస్వామి ఆశీస్సులతో అందరూ సుఖసంతోషాలతో జీవించాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ కాంక్షించారు. చండీ హోమానికి హాజరైన ఆయన తొలుత స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అగ్నికుల క్షత్రియ సంఘ జిల్లా అధ్యక్షుడు నగిరి చంద్రశేఖర్, ఈఓ దర్గయ్య, దేవస్థాన కమిటీ చైర్మన్ సాదా నాగయ్య, కార్పొరేటర్లు మొగ్గళ్లపల్లి కామాక్షిదేవి, కిన్నెర ప్రేమ్‌కుమార్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తొమ్మిదో డివిజన్ ఇన్‌చార్జి వంగాల శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి బాటలు

రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగానే గ్రామ, వార్డు స్థాయిలో నెలకొన్న ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించింది. ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలను కేటాయించడంతో గ్రామస్థాయిలో అభివృద్ధి పనులు వేగమందుకున్నాయి.

- మారిన గ్రామ, పట్టణ రూపురేఖలు
- ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు

బుచ్చిరెడ్డిపాళెం: గ్రామ స్వరాజ్య స్థాపనలో భాగంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇప్పటికే ఈ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. సచివాలయ స్థాయిలో సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అభివృద్ధికి మరింత ప్రాధాన్యం వేసేలా ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలను కేటాయించారు.

ఏఏ పనులు చేశారంటే

- సచివాలయ నిధులతో గ్రామ, వార్డు స్థాయిలో గుర్తించిన పనులను త్వరగా పూర్తి చేస్తారు.



రామచంద్రాపురం గిరిజన కాలనీలో సచివాలయ నిధులతో ఏర్పాటు చేసిన సీసీరోడ్డు

- గ్రామ, వార్డు స్థాయిలో అంతర్గత రోడ్డు మరమ్మతులు, సీసీరోడ్ల నిర్మాణం
- తాగునీటి ట్యాంకులు, కుళాయిల ఏర్పాటుతో పాటు నీటి సమస్యలకు పరిష్కారం
- శ్మశానవాటికలను అభివృద్ధి చేయడంతో పాటు ప్రహరీలను నిర్మిస్తారు
- గ్రామాల్లోని కాలనీల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు
- సైడు కాలువల నిర్మాణం, ఆధునీకరణ.

మండలం	సచివాలయాల సంఖ్య	మంజూరైన నిధులు
బుచ్చిరెడ్డిపాళెం టౌన్	10	రూ.2 కోట్లు
బుచ్చిరెడ్డిపాళెం రూరల్	13	రూ.2.60 కోట్లు
విడవలూరు	13	రూ.2.60 కోట్లు
కొడవలూరు	16	రూ.3.20 కోట్లు
ఇందుకూరుపేట	18	రూ.3.60 కోట్లు
కోవూరు	16	రూ.3.20 కోట్లు

నియోజకవర్గంలోని సచివాలయాలు 86

కేటాయించిన నిధులు రూ. 17.20 కోట్లు



నూతనంగా నిర్మించిన సైడు కాలువ

పనులు వేగంగా జరుగుతున్నాయి



మా గ్రామ పరిధిలో రెండు సచివాలయాలు ఉన్నాయి. వీటి ద్వారా తమ గ్రామ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.40 లక్షలు కేటాయించింది. దీంతో ఇప్పటికే సీసీరోడ్డు, సైడ్ కాలువను ప్రారంభించారు. ఈ పనులు పూర్తయితే గ్రామస్తులకు ఎంతో మేలు.

– రమేష్, స్థానికుడు, దామరమడుగు

రోడ్లకు మహర్దశ



సచివాలయ నిధులతో ఎస్టీ కాలనీలో సీసీరోడ్డును ఏర్పాటు చేశాం. గతంలో ఇక్కడ చిన్నపాటి వర్షానికి రోడ్డు బురదమయంగా మారవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం కాలనీలో సిమెంట్ రోడ్డు నిర్మించడంతో స్థానికుల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సురేంద్రరెడ్డి, దంపూరు, సర్పంచ్

బాగుపడిన మొగళ్లూరు రోడ్డు



గతంలో గుంతలమయంగా ఉన్న మొగళ్లూరు రోడ్డు



కొత్తగా నిర్మించిన సిమెంటురోడ్డు

- రూ.1.13 కోట్లతో సీసీరోడ్డు

పొదలకూరు : దీర్ఘకాలికంగా గుంతలతో ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని స్థితిలో ఉన్న మండలంలోని మొగళ్లూరు రోడ్డు ప్రస్తుతం బాగుపడింది. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రోడ్డు నిర్మాణానికి నిధులు సాధించి గ్రామస్తుల కల సాకారం చేశారు. ఈ గ్రామం మీదుగా ఊసపల్లి, అంకుపల్లి, పులికల్లు, వెంకటాపురం, పర్వతాపురం, వావింటపర్తి గ్రామస్తులు వెళ్తుంటారు. తారురోడ్డు అయితే చాలని గత ప్రభుత్వంలో కోరిన గ్రామస్తులకు ప్రస్తుతం రూ.1.13 కోట్లతో సిమెంటురోడ్డును నిర్మించారు. ఇన్నేళ్లుగా గ్రామస్తులు ఎదుర్కొన్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. సిమెంటురోడ్డు నిర్మించాలనే ఉద్దేశంతోనే కొంత జాప్యం నెలకొన్నట్లుగా తెలుస్తోంది. రెండు దశాబ్దాల పాటు రోడ్డుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని ఆయా గ్రామస్తులు వెల్లడిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణికి కృతజ్ఞతలు తెలిపారు.

దర్గాను సందర్శించిన ఎమ్మెల్యే ప్రసన్న



కసుమూరు దర్గాలో ఆశీర్వాదం అందుకుంటున్న ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు : వెంకటాచలం మండలం, కసుమూరులో ఉన్న మస్తాన్‌వలీ దర్గాను కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మతపెద్దల ఆశీర్వాదం పొందారు. ఎమ్మెల్యే వెంట డీసీఎంఎస్ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతి రావు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, కోవూరు మండల సచివాలయ కన్వీనర్ తవరగిరి ప్రసాద్ ఉన్నారు.

సీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ



రోగులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ రమేష్

కోవూరు : కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం రాత్రి డీసీహెచ్ఎస్ (జిల్లా సామాజిక ఆరోగ్య కేంద్రాల కోఆర్డినేటర్) డాక్టర్ రమేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న డాక్టర్ కౌశికను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యం మీద ప్రజలకు మరింత నమ్మకం కలిగే విధంగా వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పని చేయాలని సూచించారు. అనంతరం రోగులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు.

నేడు రాజ్యసభ సభ్యులచే పింఛన్‌ల పంపిణీ

కొడవలూరు : మండలంలో నూతనంగా మంజూరైన సామాజిక పింఛన్‌లను స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం పంపిణీ చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య ఆదివారం తెలిపారు. రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేస్తారన్నారు. ఉదయం 9.30 గంటలకు జరిగే కార్యక్రమానికి మండలంలోని నాయకులు, అధికారులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నేడు సచివాలయం, ఆర్బీకే ప్రారంభం



మాట్లాడుతున్న ప్రసాద్

మనుబోలు : మండల కేంద్రమైన మనుబోలులో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం ప్రారంభిస్తారని ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తప్పక హాజరుకావాలని సూచించారు. మంత్రి పర్యటనను జయప్రదం చేయాలని కోరారు.

నైపుణ్యంతో ఆర్థికాభివృద్ధి



కనుపూరులో కలంకారి యూనిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం : ఏ రంగంలోనైనా నైపుణ్యం సాధిస్తేనే ఆర్థికాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కనుపూరు గ్రామంలో చిట్టిబాబు దంపతులు నెలకొల్పిన కలంకారి చీరల యూనిట్‌ను మంత్రి కాకాణి చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్ల క్రితం వెంకటాచలంలో కలంకారి శిక్షణ కార్యక్రమాన్ని తన చేతుల మీదుగా ప్రారంభించామని, ఆ కార్యక్రమంలో శిక్షణ పొందిన చిట్టిబాబు దంపతులు నేడు పది మందికి ఉపాధి కల్పించేలా కలంకారి యూనిట్‌ను నెలకొల్పడం స్ఫూర్తిదాయకమన్నారు.

ఈ యూనిట్ ద్వారా ఉత్పత్తి అయ్యే కలంకారి చీరలు జిల్లా నలుమూలలకు చేరాలని ఆకాంక్షించారు. మరుగున పడిపోతున్న కళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకటశేషయ్య, మండల వైస్ ఎంపీపీ పచ్చబట్ల మస్తానయ్య, సర్పంచ్ నాటకం శ్రీనివాసులు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకరించాలి

- డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు



నార్తురాజుపాళెంలో ట్రాఫిక్ సమస్యను పరిశీలిస్తున్న చలపతిరావు

కొడవలూరు : నార్తురాజుపాళెం అభివృద్ధిలో భాగంగా సెంటర్ లైటింగ్ పనులు జరుగుతున్నాయని, ట్రాఫిక్ విషయంలో ప్రయాణికులు సహకరించాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు కోరారు. నార్తురాజుపాళెంలో జరుగుతున్న లైటింగ్ పనులను ఎస్సై జి.సుబ్బారావుతో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ సెంటర్ లైటింగ్ పనులు శరవేగంగా జరిగేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా రోడ్డు వేస్తున్న చోట వాహనాలను మరో వైపు మళ్లిస్తూ అడ్డుగా ఏదైనా ఏర్పాటు చేస్తే ద్విచక్ర వాహనదారులు వాటిని తొలగించి రోడ్డు వేస్తున్న మార్గంలోనే వెళ్తున్నారని, దీనివల్ల రోడ్డు పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని చెప్పారు. ధాన్యం లారీలను సైతం బొడ్డువారిపాళెం మీదుగా వెళ్లాలని సూచించినా రోడ్డు వేస్తున్న మార్గంలోనే వస్తుండడం వల్ల ట్రాఫిక్ స్తంభించడంతో పాటు పనులకు అంతరాయం కలుగుతోందన్నారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా సెంటర్ లైటింగ్ పనులు చేపడుతున్నామని, ఇది త్వరగా పూర్తయ్యేలా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నేతలు కొండా శ్రీనివాసులురెడ్డి, నెలవాయి మాణిక్యరావు, ఎండీ కరిముల్లా, ఇసనాక సునీల్‌రెడ్డి, మారంరెడ్డి రంగారెడ్డి, తాటిపర్తి భాస్కర్, బొచ్చు శ్రీనివాసులు, సయ్యద్ రఫీ, పంచాయతీ కార్యదర్శి జి.జాలయ్య ఉన్నారు.

నేడు మండలాల్లో మంత్రి కాకాణి పర్యటన

కొత్త పింఛన్ల పంపిణీ

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా సోమవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో కొత్త పింఛన్లను అందజేస్తామని ఎంపీడీఓ నగేష్‌కుమారి ఆదివారం తెలిపారు. కొత్తగా పింఛన్లు అందుకునే లబ్ధిదారులను ఎంపీడీఓ కార్యాలయానికి తీసుకురావాల్సిందిగా వలంటీర్లకు సూచించారు.

తోటపల్లిగూడూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం మండలంలో పర్యటిస్తున్నట్లు ఎంపీడీఓ హేమలత తెలిపారు. ఆమె ఆదివారం మాట్లాడుతూ మంత్రి కాకాణి తన పర్యటనలో భాగంగా సోమవారం సాయంత్రం 5 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నూతన పింఛన్లను పంపిణీ చేస్తారని వివరించారు.

– ముత్తుకూరు : రాష్ట్ర వ్యవసాయ–సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం సాయంత్రం ముత్తుకూరుకు వస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధనరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేసే కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని పేర్కొన్నారు.

వేగంగా సిమెంటు రోడ్డు పనులు

- మంత్రి కాకాణి చొరవతో నిధులు



పొదలకూరు : పట్టణంలో సిమెంటురోడ్డు పనులు వేగంగా జరుగుతోంది. ముందుగా రోడ్డుకు ఇరువైపులా విస్తరణ పనులను చేపట్టారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో నిధులు మంజూరయ్యాయి. దీంతో స్థానిక బస్టాండ్ నుంచి రామనగర్‌గేటు సెంటర్ వరకు 650 మీటర్ల నిడివితో సీసీరోడ్డు పనులను చేపడుతున్నారు. రెండు, మూడు మాసాల్లో రోడ్డు పనులను పూర్తి చేయిస్తామని ఆర్అండ్‌బీ డీఈ సురేఖ వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న రోడ్డు వెడల్పు స్వల్పంగా పెంచి వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విస్తరణ పనులను చేయించాల్సిందిగా మంత్రి కాకాణి అధికారులకు సూచించారు. మరీ ఇరుకైన చోట్ల స్వల్పంగా తాత్కాలికంగా ఉన్న దుకాణాలను సర్ది వారి వ్యాపారాలకు సమస్య లేకుండా చూడాలని ఆదేశాలు ఇచ్చారు. ఫలితంగా ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికారులు సమన్వయంగా కొలతలు తీసుకుని రోడ్డు విస్తరణ పనులను నిర్వహిస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే పట్టణంలో చాలావరకు ట్రాఫిక్ సమస్యలు పరిష్కారం కావడంతో పాటు, రెండు దశాబ్దాల క్రితం దెబ్బతిన్న సీసీరోడ్డు స్థానంలో చక్కటి సిమెంటురోడ్డు నిర్మాణం జరిగే అవకాశం ఉంది.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మండపం పంచాయతీలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మండపం పంచాయతీ సీఎస్‌పురంలో రూ.2.80 కోట్లతో నిర్మించిన 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను మంత్రి కాకాణి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నిరంగాలపై ఎలా దృష్టి సారించిందో విద్యుత్ సరఫరా విషయంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకొంటున్నామన్నారు. సాధారణంగా వర్షాలు పడాల్సిన ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో వేసవిని తలపించేలా ఎండలు కాస్తున్నాయని, అయినా విద్యుత్ అంతరాయానికి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. గత ఆగస్టు నెలలోనే యూనిట్ విద్యుత్‌ను రూ.9.10ల చొప్పున రూ.996 కోట్లతో కొనుగోలు చేసి గృహ అవసరాలతో పాటు వ్యవసాయ రంగానికి విద్యుత్‌ను అందిస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ సమస్య ఏర్పడితే పరిశ్రమలకు కొంత కోత విధించి అయినా సాధారణ వినియోగదారులకు పూర్తిస్థాయిలో విద్యుత్‌ను అందిస్తామన్నారు. మండపం పంచాయతీ పరిధిలో రైతులు, ప్రజల లో–ఓల్టేజీ సమస్యకు చెక్ పెట్టేందుకు రూ.2.82 కోట్లతో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని చేపట్టినట్లు వివరించారు. దీని వల్ల చంద్రశేఖరపురం, మండపం, గొల్లపాళెం, ఈదూరు, పాత కోడూరు, కొత్తకోడూరు గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. అలాగే నియోజకవర్గంలో లో–ఓల్టేజ్ సమస్యలను అధిగమించేందుకు అవసరమైన ప్రతీ చోట విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణాలను చేపట్టి నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడిచిన నాలుగేళ్లలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించారని, రానున్న రోజుల్లోనూ ఇదే కొనసాగుతుందన్నారు. నూతన సబ్‌స్టేషన్‌ను వేగవంతంగా పూర్తి చేసేందుకు సహకరించిన విద్యుత్ శాఖాధికారులకు మంత్రి కాకాణి కృతజ్ఞతలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ నేత కాల్తిరెడ్డి సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, మండల ఉపాధ్యక్షుడు చెరుకూరు శ్రీనివాసులునాయుడు, పార్టీ నేతలు టంగుటూరు పద్మనాభరెడ్డి, ఎండికళ్ల దయాకర్‌గౌడ్, మన్నెం సుబ్రహ్మణ్యంగౌడ్, మన్నెం చిరంజీవులగౌడ్, గిరి, సుధీర్, ఎంపీటీసీ సభ్యులు ఇనకళ్ల సరస్వతి, ఉప సర్పంచ్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.